

# నిరీక్షణ

జీవితాన్ని సమీక్షించుకుంటు న్నాను. ఇప్పుడిక అదొక్కటే మిగిలిపోయింది. తప్పొప్పుల పట్టిక సరిచేసుకుంటూ సత్యా సత్యాలని విచక్షించు కుంటున్నాను.

జైల్లో ఉన్నాను కాబట్టి కావలసినంత విశ్రాంతి! రేపో మాపో ఉరి తీస్తారు కాబట్టి చెప్పలేనంత నిశ్చింత!

నా ముప్పైఏళ్ళ జీవితంలో మంచి చెడులన్నీ లెక్క చూసుకుంటే అసలు మొదటి ఇరవయ్యేళ్ళూ నేను జీవించనే లేదు అన్పిస్తుంది.ఆ ఇరవయ్యీ తీసేస్తే కేవలం పదేళ్ళ జీవితం మాత్రమే కన్పిస్తుంది.

అవును. కేవలం పదే పదేళ్ళు నేను జీవించాను. అయినా ఈ మాటను గర్వంగా చెప్పుకుంటున్నాను. ఎందుకంటే ఆ పదేళ్ళూ నేను పందిలాగో కుక్కలాగో, జీవించలేదు. మనిషిలా- ఒక నిజమైన మనిషిలా జీవించాను. ఒక ఉప్పెనలా, ఒక తుఫానులా, ఒక పీడనిలా.... ఉన్నతోన్నతంగా జీవించాను. నాకీ మహోజ్వలమైన జీవితాన్ని ప్రసాదించిన దేవతకు నేనెప్పుడూ ఋణపడే ఉంటాను. నేను మనసారా ప్రేమించిన ఆ దేవత పేరు శాంభవి

పదేళ్ళ క్రితం.... నేనొక పసివాడిలా ఉండేవాడిని. ప్రతిచిన్న విషయానికి ఊరికే బాధపడిపోయేవాడిని. ఎవ్వరేమన్నాసరే చివ్వున నాకు కన్నీళ్ళొచ్చేవి. ఎవరైనా బాధపడుతూఉంటే చూడలేకపోయేవాడిని. వాళ్ళకంటే ఎక్కువగా నేనే బాధపడేవాడిని. అడుక్కొనేవాళ్ళనీ, కుష్ఠురోగుల్నీ, తాగుబోతుల్నీ.... వీళ్ళందరినీ చూసి కుమిలి కుమిలి ఏడ్చేవాడిని. 'వీళ్ళంతా ఇంత బాధపడుతూఉంటే దేవుడేం చేస్తున్నాడు?' అనుకొనేవాడిని. ఎవర్ని చూసినా నాకు బాధపడుతున్నట్టే అనిపించేది.

నా స్నేహితులు నన్ను తుత్తినేపేడిపించేవారు. నేను ఏడుస్తూఉంటే వాళ్ళకు నవ్వొచ్చేది. నన్ను పెంచుతున్న మామయ్య కూడా అంతే కావాలని

# కె. ఆదర్శ సామ్రాట్

గట్టిగా తిట్టేవాడు. హఠాత్తుగా ఏదో అని నాకు కన్నీళ్ళు తెప్పించేవాడు. ఎవరైనా నన్ను కసురుతున్నట్టు మాట్లాడితే చాలు- నాకు ఏడుపొచ్చేది. చచ్చిపోయిన అమ్మానాన్నల ప్రసక్తి తెచ్చినా సరే నాకు ఏడుపు ముంచుకొచ్చేది. నా యీ స్వభావాన్ని కనిపెట్టి చాలా మంది చాలా రకాలుగా నన్ను ఏడిపించారు.

ఆ రోజు నా పుట్టినరోజు. సరిగ్గా ఆ రోజే నేను నా ఇరవయ్యో సంవత్సరంలోకి అడుగు పెట్టాను. అప్పటికి నా మనస్సు ఏ మాత్రం ఎదగలేదు. ఎన్నడూ లేనిది ఆ రోజు ఏదైనా గొప్పపని చేయాలని అన్పించింది. ఎవరో చెప్పారు - లైబ్రరీలో బోలెడన్ని పుస్తకాలు ఉంటాయనీ — అవన్నీ చదివితే గొప్పవాళ్ళు కావచ్చుని. నేను ఆ రోజు వరకూ లైబ్రరీకి వెళ్ళలేదు. ఎంతసేపూ మామయ్య చెప్పిన పనులు చెయ్యడము, రోజుకి పదిసార్లు ఏడ్వడము, నిశ్చింతగా కాళ్ళు ముడుచుకొని పడుకోవడము ఇవి మాత్రమే తెలుసు నాకు. నా పందొమ్మిదేళ్ళ జీవితంలో మొట్టమొదటి సారిగా నేను లైబ్రరీకి బయలుదేరాను

భయం భయంగా ఏదో పుస్తకం తీసుకొని, ఒక కుర్చీలో కూర్చుని చదవడం మొదలు పెట్టాను. అమ్మా నాన్న బ్రతికి ఉన్నప్పుడు నేను బడిలో చదువుకొనే వాడిని. అప్పుడు నేను చాలా తెలివైన వాడినట. మామయ్య అప్పుడప్పుడు ఈ మాట చెబుతుండేవాడు.

మరికొంత సేపటికి మావీధిలోనే ఉంటున్న "హబీబ్" వచ్చి నా పక్క కుర్చీలోనే కూర్చున్నాడు. వాడు నాకంటే రెండు మూడేళ్ళు చిన్నవాడే అయినప్పటికీ కన్పించినప్పుడల్లా నన్ను ఏడిపించేవాడు. ఉన్నట్టుండి వాడు నా తొడమీద గిచ్చడం మొదలుపెట్టాడు. మొదటి రెండు సార్లు నేను ఓర్చుకున్నాను. మూడో సారి వాడెంత గట్టిగా గిచ్చాడంటే ఆ బాధ భరించలేక "అమ్మా". అంటూ ఏడుపు మొదలు పెట్టాను. లైబ్రరీలోని అందరూ నన్ను వింతగా చూడసాగారు. నా ఎదురుగా నేకూర్చుని పుస్తకం చదువు కుంటున్న పాతికేళ్ళ స్త్రీ ఒకామె "ఏ మయ్యింది బాబూ!" అంటూ నా దగ్గరికి వచ్చింది. "గిచ్చుతున్నాడండీ" ఏడుస్తూ చెప్పాను. ఆమె నన్ను, హబీబ్‌ను మార్చిమార్చి చూసి వెళ్ళమని వాడి చెంపపగుల గొట్టింది. "రా బాబూ. మీ ఇంటి వరకు దిగబెడతాను" అంటూ చేయి పట్టుకొని కుర్చీలోంచి పైకిలేపింది.

మా అమ్మ చచ్చిపోలేదనీ, నా కేక వినగానే స్వర్గంలోంచి వచ్చేసిందనీ నాకా క్షణంలో అన్పించింది. నన్ను చేయిపట్టుకుని నా పుట్టిన రోజున ఇంటి వరకూ దిగబెట్టిన ఆ దివ్యమూర్తి పేరే శాంభవి!

• • • •

"ఖానా లేవ్ అన్న గద్దింపుతో ఈ దృశ్యం తెగిపోయింది.

"బైరా హోగయా క్యా" సెంట్రీ అరుస్తున్నాడు. మౌనంగా తలుపు దగ్గిరికి వెళ్ళి, అన్నంపొట్లం తీసుకుని, పిడికిలిబిగించి సెంట్రీ మూతి మీద ఫెడేల్‌మని కొట్టాను. ఆ దెబ్బకు వాడు ఎదురుగా ఉన్న గోడకు విసురుగా వెళ్ళి గుద్దుకున్నాడు. అంతకు ముందే నాలుగైదు పళ్ళు రాలిపడ్డాయి.

"లోగోంసే బాత్ కర్నేసే పహలే బాత్ కర్నేకీ తరీకా సీఖో" అనేసి లోపలికి వచ్చి అన్నం తినడం మొదలు పెట్టాను.

జైలు జైలంతా ఏదో హడావుడి కోలాహలం క్రమ్మేసాయి. అయినా నాకదేమీ పట్టలేదు. ఈ సంఘటనకు నేను ఏ మాత్రం చలించలేదు. నా ధర్మం నేను నిర్వర్తించాను. అంతే. ఖైదీతో మర్యాదగా మాట్లాడని సెంట్రీకి బుద్ధి చెప్పాను. ఇప్పుడు ఎవరో వచ్చి నన్నేదో చేస్తారనే భయం నాకు అస్సలు లేదు.

అసలిప్పుడు భయమన్నదే నాకులేదు. ఈ నిర్భీతి ఈ సాహసగుణం....ఇవన్నీ నాకు శాంభవి పెట్టిన భిక్ష!

అన్నంతింటూ మళ్ళీగడిచిన జీవితంగురించి తలపోయ సాగాను.

• • • •

ఆ పుట్టినరోజు సాయంత్రమే హబీబ్ ఏడెనిమిది మంది గూండాలతో మా ఇంటిమీదకు దాడి చేశాడు. నన్ను రోడ్డుమీదకు పిలిచి హింసించి హింసించి చావగొట్టాడు. మామయ్య కిటికీలోంచి అంతా చూస్తూనే ఉన్నాడు. రోడ్డు మీద వచ్చేవాళ్ళు-పొయ్యేవాళ్ళు-ఇరుగుపొరుగులు- అందరూ చూస్తూనే ఉన్నారు. వాళ్ళల్లోఒక్కరు ఒక్కరంటే ఒక్కరుకూడా నన్నురక్షించడానికి ముందుకు రాలేదు: దెబ్బలు తినీ తినీ అరచి అరచీ నేను సొమ్మసిల్లి పోయాను.

నాకు మెలకువ వచ్చేసరికి జ్వరంతో, బాధతో, విపరీతమైన నొప్పులతో హాస్పిటల్‌లో పడిఉన్నాను. అప్పుడది కలో నిజమో నాకు తెలీలేదు. నేను మూలుగుతూఉంటే తెల్ల కోటుతో మెడలో స్టెతస్కోపుతో ఆమె వచ్చింది. హబీబ్‌ను చెళ్ళుమని కొట్టిన స్త్రీ

ఆమె నన్ను పరీక్షించి సిస్టర్‌తో ఏదో చెప్పింది. ఆమె చేతిస్పర్శ చల్లగా.... అచ్చం అమ్మస్పర్శలా నాకు అన్పించింది. నాబాధంతా మర్చిపోయాను....అక్కడే నేను మూడువారాల వరకు ఉండిపోవలసి వచ్చింది.

ఒకరోజు ఆమె చేతిని గట్టిగా పట్టేసుకుని "అమ్మా! నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోకమ్మా! నాకు భయంగా ఉంది." అన్నాను. "అలాగే బాబూ నేను నీ దగ్గరే ఉంటాను. నువ్వేమీ భయపడకు.... భయం చాలా చెడ్డగుణం...." అంటూ ఆమె నాకేదో కథ విన్పించింది. ఆ రోజు నిద్రపోయేవరకు ఆమె చేతిని నేను వదిలిపెట్టలేదు. ఆమె చెబుతున్న మాటలు నా హృదయంలోకి సూటిగా ఇంకిపోసాగాయి. నిద్రలోకి జారుకుంటూఉండగా నాకు ఈ మాటలు విన్పించాయి—

"ఈ కుర్రవాడు మీకేమౌతాడు డాక్టర్?"

"ఏమీ కాడు."

"ఏమీకాడు."

"మీరెందుకింత ఇంట్రెస్టు చూపిస్తున్నారు?"

"ఎందుకో అతన్ని, అతని మనోస్థితిని చూస్తుంటే చెప్పలేనంత బాధగా అన్పిస్తుంది."

"మీది చాలా జాలిగుండె డాక్టర్."

రానురాను నా ఆరోగ్యం కుదుటపడసాగింది. పగలంతా మెలకువగానే ఉండసాగాను. ఆమె సాయంత్రంపూట ఎప్పుడోకాని వచ్చేదికాదు. నిద్రలేచింది మొదలు నేను ఆమె కోసమే ఎదురు చూసేవాడిని. ఆమెను చూడగానే సంతోషంతో ఉప్పొంగిఉయేవాడిని! ఆమె గురించి ఎంత బాధ పడుతూ ఎదురుచూశానో, ఆమె రాగానే ఎలాంటి సంతోషం కలిగిందో వివరంగా ఆమెకు చెప్పేవాడిని. ఆమె చిరునవ్వు నవ్వుతూ, చాలాసేపు నా దగ్గరే కూర్చుని ఎన్నెన్నో కబుర్లు చెప్పేది.

నెపోలియన్, అలెగ్జాండర్, అశోకుడు- ఇలాంటి చక్రవర్తుల జీవిత కథలను, వాళ్ళు చేసిన యుద్ధాలను కథలు కథలుగా చెప్పేది.

భీముడు, హనుమంతుడు, హెర్క్యులస్ మొద లైనవారి వీరత్వం గురించి చాలా గొప్పగా చెప్పేది. ఆమె మాట్లాడుతూఉంటే నాకెంతో హాయిగాఉండేది. నాకు చాలా చాలా ఇష్టమైన వానలో తడుస్తున్నట్లుగా ఉండేది.

ఒకరోజు ఆమె హాస్పిటల్‌కు రాలేదు. మరు నాడు నేను కన్నీళ్ళుపెట్టుకుంటే "ఒక మనిషి గురించి అంతలా ఎప్పుడూ ఎదురుచూడ కూడదు శివా" అని అందామె.

"మీరంటే నాకు చాలా ఇష్టం అక్కయ్యా. మీ గురించి కూడా ఎదురుచూడకూడదా?" అని అడిగాను. ఆమె చిరునవ్వు నవ్వి, మౌనంగా నా చేతిని నొక్కి, వెళ్ళిపోయింది.

నన్ను హాస్పిటల్ నుంచి ఇంటికి పంపించేస్తా రని తెలిసినరోజు బిగ్గరగా ఏడ్వడం మొదలు పెట్టాను. నర్సులు, వార్డ్ బోయ్‌లు, మిగతా రోగులు ఎంత ఓదార్చినా నాకు దుఃఖంఆగలేదు. సరిగ్గా ఆ సమయంలో ఆమె అక్కడికి వచ్చింది. ఆమెను గట్టిగా పట్టేసుకుని "నేను ఎక్కడికీ పోనక్కయ్యా. ఇక్కడే ఉంటాను" అని ఏడుస్తూ చెప్పాను. ఆమె నన్ను బుజ్జగించి "తప్పు శివా! అలా అనకూడదు. ఇప్పుడు నీకు బాగయ్యిందిగా?" అంది.

"అయినాసరే నేను పోను. మిమ్మల్ని విడిచి పెట్టి నేను ఉండలేను" ఆమె చేతిని గట్టిగాపట్టు కొని ఏడుస్తూ చెప్పాను. ఆమె నావైపు కొంచెం సేపు దీక్షగా చూసి "అలాగే నువ్వు నాతోనే ఉందువులే" అని ఓదార్చింది.

ఆ మరునాడే శాంభవి నన్ను తన ఇంటికి తీసుకెళ్ళింది. ఆ ఇంట్లోకి అడుగు పెడుతుంటే స్వర్గంలోకి వెళుతున్నట్లుగా నాకు అన్పించింది.

"చూడు శివా! మీ మామయ్యతో మాట్లాడి ఇక్కడికి నిన్ను తీసుకొచ్చేశాను. ఇంత వరకు ఈ ఇంట్లో నేనొక్కదాన్నే ఉంటున్నాను ఇక నుంచి ఇది మన ఇద్దరి ఇల్లు. నువ్వు ఎప్పటికీ ఇక నాతోనే ఉండి పోవచ్చు. కానీ నువ్వెప్పుడైతే ఏడుస్తావో అప్పుడిక నీతో నేను మాట్లాడను. నేనే ఈ ఇల్లువదిలి ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోతాను...." అప్పుడు శాంభవి చెప్పిన మాటలు నా మనసులో బలంగా నాటుకుండి పోయాయి. ఇంకెప్పుడూ నేను ఏడ్వకూడదని ఆమె తన మీద ఒట్టు వేయించుకుంది. మాటైతే ఇచ్చాను కాని ఏడ్వకుండా ఉండడం నాకు చాలా కష్టమైపోయింది. అయినా ఆమెకిచ్చిన మాట కోసం ఆనాటి నుంచి ఈనాటి వరకు ఏరోజూ నేను ఏడ్వలేదు. ఎట్టి పరిస్థితుల్లోను ఏడ్వలేదు.

శాంభవి ఇంటిలోకి అడుగుపెట్టిన మొదటి రోజు నుంచే నా జీవితం ప్రభంజనంలా మారి పోయింది.

ఆమె నాకు యోగాసనాలు నేర్పించింది. యోగసాధన మొదలు పెట్టగానేనాలో విచిత్ర మైన శక్తి పుంజుకోవడం మొదలయ్యింది. ప్రతి రోజూ మూడు గంటల సేపు రకరకాల కస రత్తులు చేయించింది. నాచేత వందలకొద్ది పుస్త కాలు చదివించింది వీటన్నిటి వల్లా, వీటన్నిటినీ మించి ఆమె కురిపించిన అనురాగం వల్ల నాలో విచిత్రమైన మార్పు సంభవించింది.

"శివా! మనిషిలాగా బ్రతకాలంటే ముందుగా కావలసింది ప్రాణంకాదు. బలం! బలమేకావాలి! ఈ ప్రపంచంలో ప్రతి మనిషి బలవంతుడై నప్పుడు ఇన్ని కష్టాలూ, కన్నీళ్ళూ మనకు కనిపించవు. మనుషులు ఏడ్వడానికి, బాధ పడ డానికి అన్నిటికీ వాళ్ళ బలహీనతలే కారణం! నువ్వు బలవంతుడివి కావాలి శివా! చాలా బల వంతుడివి కావాలి! నెపోలియన్ కంటే, అలె గ్జాండర్ కంటే, హెర్క్యులస్ కంటే కూడా బలవంతుడివి కావాలి" శాంభవి మాటలు నన్ను ఉత్తేజ పరిచేవి.

రెండేళ్ళ ఆమె సాహచర్యంలో నేనుపూర్తిగా మారిపోయాను. ప్రపంచం మీద పడినా చలిం చని ధీరుడిగా తయారయ్యాను. నా చుట్టూ ఉన్న ప్రపంచం గురించి, నా గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకొన్నాను.

ఆ తర్వాత....ఆమె నన్ను ఒంటరిగా ఈ ప్రపంచం మీదకు విడిచి పెట్టింది. ఏ ఆశయం కోసం ఆమె నన్ను వీరునిగా, ధీరునిగా తీర్చి దిద్దిందో ఆ ఆశయాన్ని సాధించడం కోసమే అహర్నిశలు కృషి చేశాను. అనుక్షణమూ పరి తపించాను.

పతితుల్ని, భ్రష్టుల్ని, దీనుల్ని...అంద రినీ కదిలించాను. వాళ్ళని వీరులుగా, శూరు లుగా బ్రతకమని ఆదేశించాను. మనుషుల్ని సైనికుల్లాగా, మరఫిరంగుల్లాగా మార్చివేశాను. "పదండి ముందుకు-పదండి తోసుకు-పోదాం పైపైకి." అంటూ వాళ్ళని హిమశిఖరాలవైపు నడిపించాను. కోట్లాది మానవుల కష్టాలకు బాధ లకు కారణమైన ఈ దోపిడీ వ్యవస్థను, దోపిడీ వర్గాలనూ తూర్పారబట్టాను. ఈ ప్రభుత్వాలను సింహాసనాలను గజ గజ లాడించాను. మొత్తా నికి నేనో ప్రళయంలా జీవించాను. మనిషిలా జీవించాను.

"రానురాను జీవితం దుర్భరం కావడానికీ, ధరలు విపరీతంగా పెరగడానికీ, అన్యాయాలూ అక్రమాలూ దౌర్జన్యాలూ హింసలూ-ఇవన్నీ విజృంభించడానికీ, శాంతి మరణించడానికి....ఓ మనుషుల్లారా! అన్నిటికీ-మీరు అనుభవిస్తున్న ప్రతి నరకానికీ మీ బలహీనతలే కారణం! మీ దౌర్బల్యాలను వదిలిపెట్టండి. మీ దుర్బలతలను చావగొట్టండి. ప్రపంచాన్ని సుఖమయంగా మార్చడంకోసం-శాంతి,కరుణ, ప్రేమ-ఇక్కడ శాశ్వతంగా నెలకొల్పడం కోసం-యుద్ధం-చెయ్యడం నేర్చుకోండి. సింహాల్లా విజృంభిం చడం నేర్చుకోండి. మంచికోసం, మానవత్వం కోసం ప్రాణాలను త్యజించడం నేర్చుకోండి.."

నా మాటలు ఇప్పుడు వేలాదిమంది గుండెల్లో ఫిరంగి ధ్వనుల్లా మారు మ్రోగుతున్నాయి. నాకిప్పుడు ఎంతో తృప్తిగా ఉంది.

రేపో ఎల్లుండో నన్ను ఉరి తీయవచ్చు. అయినా నాకు బాధగా లేదు. నాలాంటి వాళ్ళు దేశంలో ఇంకా చాలామంది ఉన్నారు. ఒక్క శాంభవి నన్ను వీరునిగా తీర్చిదిద్దితే, ఆ ఒక్క "నేను" వేలాదిమంది పీడితుల్ని మహావీరులుగా తీర్చిదిద్దాను.

• • •

"మిస్టర్ శివకుమార్! మీకు ఎవరినైనా చూడాలని ఉందా?"

"ఉంది."

"ఎవర్ని?"

"డాక్టర్ శాంభవిని."

"ఎవరామె?"

"వివేకానందుడి శిష్యురాలు."

"ఎక్కడుంటుంది?"

"స్వర్గంలో....భగవంతుడి హృదయంలో."

జైలుగోడలు నామాటల్ని తిరిగి చెప్పాయి. *

## నీటిపాలైన బంగారం!

సముద్రపు జలాల్లో కలిసిపోయి వున్న బంగారం సుమారు 9 మిలియన్ల టన్నులు వుందని ఓ అంచనా. బంగారు గనుల ద్వారా వెలికి తీయబడుతున్న బంగారానికి 180 రెట్లు సముద్రాలలోనే వుందని లెక్క తేలింది. ఆ బంగారం వెలికితీయడం లాభ సాటిగానే వుంటుందని శాస్త్రజ్ఞులు అంటు న్నారు.

